RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 245 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శనివారం, 9 మార్చి 2024 | పేజీలు : 4 | వెల : 2/-

## ఎన్నికల వేళ మోడీ తాయిలాలు...

# కోట్ల ఓట్లపై కన్ను!






## ప్రధాని మోదీ పక్కా వ్యూహం!!

ప్రజలకు ఉచితాలు ఇచ్చి ఓటు వేయించుకునేందుకు తాము సిద్ధంగా లేమని పదే పదే చెప్పే బీజేపీ నాయకులు.. పరోక్షంగా ఉచితాలు ఇచ్చేందుకు రెడీ అయ్యారు. దేశ వ్యాప్తంగా ఉచితాన్ని అధికారం చేశారు. మరో వారంలో ఎన్నికల షెడ్యూల్ రానున్న నేపథ్యంలో కేంద్ర కేబినెట్ సమావేశంలో సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. దీనిలో పైకి కనిపించని ప్రధాన ఉచితాలు మైమరిపిస్తున్నాయి. మోడీ కేబినెట్ ఈ ఉచితాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం. దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షలకు పైగా ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, దీనికి రెండింతలు ఉన్న పింఛనర్లను లక్ష్యంగా చేసుకుని వారికి 4% డీఏ/డీఆర్‌ని పెంచారు. దీనిని జనవరి నుంచే వర్తింపజేయనున్నారు. వాస్తవానికి ఇలాంటి వాటికి ముందు వచ్చే నెలల నుంచి అమలుకు నిర్ణయం తీసుకుంటారు. కానీ, ఎన్నికల వేళ కావడంతో రెండు నెలలు వెనక్కి వెళ్లి అమలు చేస్తున్నారు. ఈ నిర్ణయం వల్ల సుమారు 10 కోట్ల ఓట్లు బీజేపీకి సానుకూలంగా మారనున్నాయి. ఇక, మహిళలను మెరిపించేందుకు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద వంటగ్యాస్ సిలిండర్‌పై ప్రస్తుతం ఇస్తున్న రూ.300 రాయితీని మరో ఏడాది పొడిగించారు. దీనివల్ల 10.27 కోట్ల మంది లబ్ధిదారు లకు ఏడాదిలో గరిష్ఠంగా 12 సిలిండర్ల వరకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. అంటే.. ఒక్కొక్క ఇంట్లో మూడు ఓట్లు వేసుకున్నా.. 30 కోట్లకు పైగా ఓట్లు బీజేపీకి సానుకూలంగా మారనున్నాయి. మరో కీలకమైన విషయం ఏంటంటే.. కాంగ్రెస్ పార్టీ టార్గెట్ చేసిన ఈశాన్య రాష్ట్రాలను కూడా మోడీ సర్కా రు వదల్లేదు. ఈశాన్య రాష్ట్రాల్లో పరిశ్రమలను ప్రోత్సహించడానికి 'ఉన్నతి-2024' పేరుతో రూ.10,037 కోట్ల పథకానికి శ్రీకారం చుట్టింది. దీంతో 8 ఈశాన్య రాష్ట్రాల్లో పరిశ్రమల ఏర్పాటు సుగమం కానుంది. తద్వారా.. ఉపాధి, ఉద్యోగాలు పెరిగి బీజేపీకి తక్షణ ఓటు రూపంలో భారీ మేలు జరగనుంది. ఇక, మేధావులను, సాఫ్ట్ వేర్ ఉద్యోగులను ఆకట్టుకునేలా దేశంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) అభివృద్ధి, పరిశోధనల కోసం సమగ్ర వ్యవస్థ ఏర్పాటు చేసే దిశగా.. రూ.10,372 కోట్లతో 'ఏఐ మిషన్'కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. యువతకు శిక్షణ, ఆవిష్కరణ కేంద్రాల ఏర్పాటు, కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేయనున్నారు. ఇది.. మేధావులను, యువతను పెద్ద ఎత్తున బీజేపీ వైపు ఆకర్షించే ప్రయత్నం.

**ప్రధాని మోదీ మహిళా దినోత్సవ కానుక – గ్యాస్ ధర తగ్గింపు..!!...**

మహిళా దినోత్సవం నాడు ప్రధాని మోదీ కానుక ప్రకటించారు. దేశ వ్యాప్తంగా వంట గ్యాస్ వినియోగ దారులకు గుడ్ న్యూస్ చెప్పారు. వంట గ్యాస్ పైన రూ 100 మేర తగ్గిస్తున్నట్లు వెల్లడించారు. మహిళా దినోత్సవం నాడు ఈ నిర్ణయం ద్వారా కోట్లాది మంది మహిళలకు మేలు జరుగుతుందని వివరించారు. మరో నాలుగు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుండటంతో ప్రధాని మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారు. నారీ శక్తికి తమ నిర్ణయం మేలు చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ వరుసగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. తాజాగా జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రస్తుతం అమలు చేస్తున్న ఉజ్వల స్కీమ్ ను మరో ఏడాది పాటు అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ పథకం ద్వారా అర్హత కలిగిన వారికి సిలిండర్‌పై రూ. 300 సబ్సిడీ అందిస్తోంది. ఈ సబ్సిడీ మొత్తాన్ని మరో ఏడాది పాటు అందిచనున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఇప్పుడు ప్రధాని మోదీ మహిళా దినోత్సవం నాడు మరో కానుక ప్రకటించారు. దేశ వ్యాప్తంగా ప్రతీ వినియోగదారుడికి వంట గ్యాస్ పైన రూ 100 మేర రాయితీ ఇస్తున్నట్లు ట్వట్ చేసారు. కోట్లాది కుటుంబాలకు ఈ నిర్ణయం మేలు చేస్తుందని వివరించారు. మహిళా సాధికారితకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా మహిళలకు ఆర్ధిక భారం గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. వరుసగా మూడో సారి గెలిచి హ్యాట్రిక్ విజయం పైన కన్నేసిన ప్రధాని మోదీ తొలి నుంచి వ్యూహాత్మకంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. 370 సీట్లు గెలవటమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. పాలనా పరంగా, రాజకీయంగా వరుస నిర్ణయాలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా ఇప్పుడు మహిళా ఓటర్లను ఆకట్టుకొనే విధంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రతీ నెలా వంట గ్యాస్ ధరల పైన మానిటర్ చేస్తూ ధరలను ప్రభుత్వం నిర్ణయం చేస్తోంది. కొద్ది నెలలుగా వాణిజ్య సిలిండర్ల ధరల విషయంలో హెచ్చు తగ్గులు ఉన్నా..డొమెస్టిక్ గ్యాస్ విషయంలో ధరల్లో మార్పు చేయలేదు. ఇప్పుడు, ఎన్నికల సమయంలో..మహిళా దినోత్సవం వేళ ప్రధాని మోదీ సిలిండర్ ధర రూ 100 మేర తగ్గిస్తూ ప్రధాని నిర్ణయం ప్రకటించారు.

# పాతబస్తీ మెట్రోకు శంకుస్థాపన

## ఓల్డ్‌సిటీ అభివృద్ధి చెందుతుందన్న రేవంత్






హైదరాబాద్: సుమారు రూ.2 వేల కోట్ల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన పాతబస్తీ మెట్రో శంకుస్థాపన కార్యక్రమం సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా శుక్రవారం జరిగింది. ఫరూక్ నగర్ బస్ డిపో వద్ద ఆయన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీ అసదుద్దీన్ తదితరులు ఉన్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్ నుమా వరకు మెట్రోను పొడగించనున్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కిలోమీటర్ల పొడవునా ఈ రైలుమార్గంలో 5 మెట్రో స్టేషన్లు ఉంటాయి. దీనికి రూ.2 వేల కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. నిర్మాణం పూర్తయితే సికింద్రాబాద్ నుంచి జేబీఎస్, ఎంజీబీఎస్ మీదుగా పాతబస్తీకి ప్రయాణం చేయొచ్చు. సాలార్ జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, షంషీర్ గంజ్, ఫలక్ నుమా మెట్రో స్టేషన్లు ఉంటాయి. మత పరమైన నిర్మాణాలకు ఆటంకాలు సృష్టించకుండా మెట్రో నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. కేటాయించిన నిధుల్లో రూ.వెయ్యి కోట్లు స్థల సేకరణకే వెళ్తాయని అధికారులు చెబుతున్నారు. ఓల్డ్ సిటీ మెట్రో అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ కష్టాలు తీరడంతోపాటు పాతబస్తీ మరింత అభివృద్ధి దిశలో దూసుకుపోనుంది.



## కేసీఆర్‌తో మల్లారెడ్డి కీలక భేటీ.. పార్టీ మారడంపై క్లారిటీ ఇచ్చేశారట..!

హైదరాబాద్, మార్చి 08: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోఆ పార్టీ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డి భేటీ అయ్యారు. వీరి భేటీలో కీలక అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. పార్టీ మార్పు అంశం, మల్కాజిగిరి టికెట్ కేటాయింపు, రాజశేఖర్ రెడ్డి కాలేజీ భవనాల కూల్చివేత సహా పలు అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. వాస్తవానికి గత కొద్ది రోజులుగా మల్లారెడ్డి పార్టీ మారుతారని, కాంగ్రెస్‌లోకి వెళ్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతో బీఆర్ఎస్ అధిష్టానం అలర్ట్ అయ్యింది. పార్టీ అధినేత కేసీఆర్.. మల్లారెడ్డికి కబురు పంపారు. దీంతో నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి మల్లారెడ్డి, ఆయన తనయుడు భద్రారెడ్డి వచ్చారు. కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ మారడంపై ప్రధానంగా చర్చించారట. గురువారం నాడు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డితో మల్లారెడ్డి భేటీ అవడంపై చర్చించారు. అలాగే మర్రి రాజశేఖర్ రెడ్డి కాలేజీ భవనాల కూల్చివేతపైనా కేసీఆర్ ఆరా తీశారు. కాగా, తాను పార్టీ మారబోనని కేసీఆర్‌తో తేల్చి చెప్పారు మల్లారెడ్డి. ఎట్టి పరిస్థితుల్లోనూ బీఆర్ఎస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని, మీవెంటే నడుస్తానని కేసీఆర్ కు మల్లారెడ్డి స్ప ష్టం చేశారట. అలాగే తమ కుటుంబానికి మల్కాజిగిరి ఎంపీ సీటు వద్దని చెప్పారట. ఈ సీటును మెరెవ రికైనా ఇవ్వాలని కేసీఆర్‌కు సూచించారట మల్లారెడ్డి. అయితే, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మల్లారెడ్డి కుమారుడు బరిలోకి దిగుతారని జోరుగా ప్రచారం జరిగింది.



# సార్వత్రిక ఎన్నికలకు కౌంట్ డౌన్ స్టార్ట్

## 13,14 తేదీల్లో షెడ్యూల్ విడుదల! - ఏడు దశల్లో ఎన్నికలు!!

సార్వత్రిక ఎన్నికలకు కౌంట్ డౌన్ కొనసాగుతోంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఈసీ సమాయత్తం అవుతోంది. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికలకు ప్రధాన పార్టీలు సిద్ధం అవుతున్నాయి. రాష్ట్రాల వారీగా ఎన్నికల సంఘం ఎన్నికల ఏర్పాట్ల పైన వరుస సమీక్షలు నిర్వహిస్తోంది.

వచ్చే వారం 13, 14 తేదీల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏడు దశల్లో ఎన్నికలు జరనున్నాయి.

**ఎన్నికల షెడ్యూల్ :** ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడదులకు తుది ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 13, 14 తేదీల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఛాన్స్ ఉంది. ఈ మేరకు ఇప్పటికే అధికార యంత్రాంగానికి సంకేతాలు అందుతున్నాయి. రాజకీయ పార్టీల నేతలు అలర్ట్ అవుతున్నారు.

ఢిల్లీ నుంచి అందుతున్న సమాచారం మేరకు తెలుగు రాష్ట్రాల్లో తొలి విడతలోనే పోలింగ్ జరిగే అవకాశం ఉంది. 2019 ఎన్నికల సమయంలో మార్చి 10న షెడ్యూల్ రాగా, ఏప్రిల్ 11న పోలింగ్ జరిగింది. మే 23న ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ సారి అదే విధంగా ఈ నెల 13, 14 తేదీల్లో షెడ్యూల్ విడుదల చేస్తే.. ఏప్రిల్ 15-20 మధ్యన పోలింగ్ ఉండనుంది. మే చివరి వారంలో ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

**పార్టీలు సమాయత్తం :** దేశంలోని సార్వత్రిక, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు భారత ఎన్నికల సంఘం కొన్ని రోజులుగా పలు రాష్ట్రాల్లో పర్యటిస్తూ ఏర్పాట్లు సమీక్షిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ సమీక్షలు నిర్వహించింది. స్థానిక అధికారులతో సమావేశాలు నిర్వహించిన ఈసీ ఇప్పటికే షెడ్యూల్‌ను కూడా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. మార్చి రెండో వారంలో ఎన్నికల షెడ్యూల్‌ను వెలువరించి ఏప్రిల్ ద్వితీయార్ధం లో పోలింగ్ నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈసారి లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల శాసన సభలకు ఎన్నికలు జరుగుతాయి. వీటితో పాటు జమ్ము కశ్మీర్‌లోనూ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించాలని ఈసీ భావిస్తోంది. హోరా హోరీ రాజకీయం : మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు ఈసారి కూడా ఏడు దశల్లోనే పోలింగ్ జరిగే అవకాశం ఉంది. షెడ్యూల్ ప్రకటించగానే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఏపీ లోని 25 ఎంపీ, తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాల కు తొలి విడతలోనే పోలింగ్ జరిగే అవకాశం ఉంది. ఈ లోగానే పొత్తుల లెక్కలు పూర్తి చేసుకొని అభ్యర్థులను ప్రకటించేలా ఏపీలోని ప్రతిపక్ష కూటమి ప్రయత్నాలు చేస్తోంది. అధికార వైసీపీ ఎన్నికలకు కేడర్ ను సమాయత్తం చేసే క్రమంలో సిద్ధం సభలను నిర్వహిస్తోంది. ఇప్పటికే పార్టీల అధినేతలు సైతం వచ్చే వారం ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుండటంతో..ఇక ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించారు. షెడ్యూల్ విడుదలతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల రాజకీయంగా మరింత ఉత్కంఠ పెంచే అకాశం ఉంది.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

### వారికోసమే కొత్త స్నేహం చేస్తున్న కేసీఆర్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయటానికి బీఆర్ఎస్ అధినేత కేసీయార్ భయపడుతున్నారా ? పార్టీలో జరుగుతున్న తాజా డెవలప్మెంట్లను చూస్తుంటే అందరిలోను ఇదే అనుమానాలు పెరిగిపోతున్నాయి. కారణం ఏమిటంటే సడెన్ గా బీఎస్పీతో కేసీయార్ పొత్తు పెట్టుకోవటమే. రెండురోజుల క్రితంవరకు కూడా కాంగ్రెస్ పైన జనాల్లో బాగా వ్యతిరేకత పెరిగిపోయిందని పార్టీ సమీక్షల్లో చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారని పదేపదే చెప్పారు. కేసీయార్ చెప్పిందంతా నిజమే అయితే మరి బీఎస్పీతో పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది ? జఒకవైపు బీఆర్ఎస్ తరపున పోటీ చేయబోయే అభ్యర్థులను ప్రకటిస్తున్నారు. మరోవైపు బీఎస్పీతో పొత్తు పెట్టుకున్నారు. ఇప్పటికే ఆరుగురు అభ్యర్థులను కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. మరో 11 నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించారు. ఇందులో సిట్టింగుల్లో ఎంతమందికి టికెట్లిస్తారో తెలీదు. ఈ నేపథ్యంలోనే సడెన్ గా కేసీయార్ తో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ భేటీ అయ్యారు. వీళ్ళమధ్య పొత్తుకుదిరింది. పార్టీవర్గాల సమాచారం ప్రకారం ఆర్ ఎస్ ప్రవీణ్ మహబూబ్ నగర్ జిల్లాలోని నాగర్ కర్నూలు ఎంపీగా పోటీ చేయబోతున్నట్లు సమాచారం. పొత్తు ఫైనల్ చేయడానికి కేసీయార్ తొందరలో ఉత్తర ప్రదేశ్ కు వెళ్ళి బీఎస్పీ అధినేత్రి మాయావతితో భేటీ అవటానికి రెడీ అవుతున్నారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం చూస్తే బీఎస్పీకి ఒకటి లేదా రెండు పార్లమెంటు సీట్లను కేసీయార్ కేటాయించే అవకాశముంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సరళిని దృష్టిలో పెట్టుకునే బీఎస్పీతో పొత్తుకు కేసీయార్ రెడీ అయినట్లు అర్ధమవుతోంది. ఎలాగంటే మొత్తం 19 ఎస్సీ సీట్లలో బీఆర్ఎస్ గెలిచింది మూడు సీట్లు అలంపూర్, స్టేషన్ ఘన్ పూర్, చేవెళ్ళ స్థానాల్లో మాత్రమే. అంటే 19 ఎస్సీ సీట్లలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ గెలిచింది కేవలం మూడు సీట్లు మాత్రమే అంటే ఎంతటి పూర్ రిజల్టో అర్ధమవుతోంది. అందుకే ఎస్సీ ఓట్లను మళ్ళీ తిరిగి బీఆర్ఎస్ వైపుకు మళ్ళించుకోవటంలో భాగాగంగానే బీఎస్పీతో పొత్తు పెట్టుకున్నట్లున్నారు. లేకపోతే ఎస్సీ ఓట్లు, సీట్లన్నీ కాంగ్రెస్ ఖాతాలోనే పడతాయనే టెన్షన్ పెరిగిపోతున్నట్లుంది. కాంగ్రెస్ కు ఎస్సీ ఓట్లు పడకుండా అడ్డుకోవాలన్నదే కేసీయార్ వ్యూహంగా కనబడుతోంది. చివరకు ఏమవుతుందో చూడాలి.

## కొత్తవిధానం.. ఆదాయమే ప్రధానం..



చెన్నూరు : భువన్ సర్వేలో భాగంగా బల్దియాల్లో గతంలో నివాస గృహాలతోపాటు వర్తక, వాణిజ్య సముదాయాలను ఇలా కొలతలు తీశారు. కొత్తగా జీఐఎస్ సాంకేతికతతో ఇళ్ల మ్యాపింగ్ చేసే ప్రక్రియను సైతం చేపట్టే యోచనలో బల్దియాలు సిద్ధమవుతున్నా యి. వీటిని యాప్‌లో పొందుపర్చి పన్నులను పారదర్శకంగా వసూలు చేసేందుకు కసరత్తు జరుగుతోంది. పూర్తి వివరాలతో ఉండే ఈ ప్రక్రియ ద్వారా బల్దియాలకు మరింత ఆదాయం సమకూరనుంది.

పట్టణాల్లో ఇలాంటి ఖాళీ స్థలాలకు ఇకపై పన్ను మదింపు చేపట్టనున్నారు. ఖాళీ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు లేకున్నా ఇక నుంచి పన్ను పరిధిలోకి రానున్నాయి. మార్కెట్ విలువ ఆధారంగా వీఎల్‌టీ కింద పన్ను మదింపు చేపట్టనున్నారు. ఉదాహరణకు 360 గజాల ఖాళీ స్థలం విలువ రూ.50 లక్షలు ఉందనుకుంటే పురపాలక శాఖ నిర్ణయించిన ప్రకారం ఇలాంటి ఖాళీ స్థలానికి మార్కెట్ విలువ ప్రకారం 0.05 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అంటే కనిష్ఠంగా రూ.2,500, గరిష్ఠంగా 0.02 శాతం అంటే రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుంది.

పురపాలికల్లో ఆస్తిపన్ను మదింపు విధానం మారనుంది. ఆస్తుల మార్కెట్ విలువ ఆధారంగా పన్ను ఖరారు కానుంది. ఇందుకు సంబంధించిన కసరత్తు ప్రభుత్వం ముమ్మరం చేసింది. పన్ను విధింపుల్లో కనిష్ఠ, గరిష్ఠ పరిమితులు ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా పురపాలికల పరిధిలో పన్ను ఖరారు నిర్ణయాన్ని వారికే అప్పగించింది. ఈ మేరకు జిల్లాలో ఏళ్ల నాటి ఆస్తి పన్నుల విషయంలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. నూతన విధానంతో బల్దియాలకు పన్ను రూపేణా రెట్టింపు ఆదాయం సమకూరనుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ విధానాన్ని అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుంది.

**75 గజాల్లోపు రూ.100..**

పురపాలక చట్టం ప్రకారం 75 గజాల్లోపు ఉన్న భవనానికి ఆస్తిపన్ను రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. నివాసేతర భవనాలకు దాని విలువలో కనిష్ఠంగా 0.10 శాతం, గరిష్ఠంగా ఒక శాతం విధిస్తారు. వాణిజ్య భవనాలకు మార్కెట్ విలువలో కనిష్ఠంగా 0.25 శాతం, గరిష్ఠంగా 2 శాతం పన్ను వసూలు చేస్తున్నారు. ఇక ప్రార్థనా మందిరాలు, గ్రంథాలయాలు, చారిత్రక నిర్మాణాలు, ఆసుపత్రులు, బల్దియా భవనాలు, అనాథ, వృద్ధాశ్రమాలకు మినహాయింపు వర్తించనుంది.

**ఖాళీ స్థలాలపైనా 0.25 శాతం..**

పురపాలకల్లో ఖాళీ స్థలాలకు పన్ను విధిస్తున్నారు. కనిష్ఠంగా 0.05 శాతం, గరిష్ఠంగా 0.20 శాతం ఖరారు చేశారు. ఖాళీ స్థలాల్లో నిర్మాణాలు లేకున్నా పన్ను పరిధిలోకి వస్తాయి. నిర్మాణం చేసేటప్పుడు వీఎల్‌టీ కింద పన్ను చెల్లించాల్సి ఉంటుంది. పురపాలకశాఖ నుంచి నిరభ్యంతర పత్రం అందజేయాల్సి ఉంటుంది. ఈ నిర్ణయంలో బల్దియాలకు అదనంగా పన్నులు సమకూరనున్నాయి. దీన్ని వివిధ అభివృద్ధి పనులకు నిధులు వెచ్చించే వెసులుబాటు కలగనుంది.

**ఆస్తి విలువ పెరిగితే పన్నూ పెరగనుంది..**


తాజా విధానంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ భూములు, వ్యవసాయేతర ఆస్తుల విలువను సవరించిన మేరకు ఆస్తి పన్ను ఖరారు చేశారు. ఇటీవల రిజిస్ట్రేషన్ల రుసుములు పెరిగిన నేపథ్యంలో అధికారులు దాని ఆధారంగా పన్ను అంచనా వేస్తున్నారు. అందులో భాగంగా నిర్మాణ స్థలం, భవన విలువను పరిగణనలోకి తీసుకుంటున్నారు. దీంతో భూమి, ఆస్తి విలువలు పెరిగే కొద్దీ పన్ను పెరుగుతోంది. గతంలో ఒకసారి ఖరారైతే కొన్నేళ్ల తరబడి అదే విలువ కొనసాగేది. నూతన విధానంతో బల్దియాలకు అదనపు ఆదాయం సమకూరనుంది.

**ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా..**

గంగాధర్, పురపాలిక కమిషనర్, చెన్నూరు

బల్దియాల్లో ఆస్తి పన్నును మార్కెట్ విలువ ఆధారంగా పెంచేందుకు చర్యలు చేపట్టాం. ప్రభుత్వం నుంచి వచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా పన్ను మదింపు ప్రక్రియ కొనసాగిస్తాం. ఇప్పటికే భువన్‌యాప్ ద్వారా నివాస గృహాల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపర్చాం. ఈ ప్రక్రియలో భాగంగా ప్రతీ ఇంటిని జియోట్యాగింగ్ చేశాం. కొత్తగా జీఐఎస్ సాంకేతికతతో ఇళ్ల మ్యాపింగ్ ప్రక్రియను ప్రారంభించనున్నాం. ఇకపై ఆస్తి విలువ ఆధారంగానే పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

## గడువు ముగిసింది.. సేకరణ మిగిలే ఉంది



నిర్మల్ : గత వానాకాలం, యాసంగి సీజన్‌లలో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం నుంచి సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్) ప్రక్రియలో జాప్యం జరుగుతూనే ఉంది. ఈ బియ్యం సేకరణకు గత నెల 29 వరకు గడువు పొడిగించిన కేంద్ర ప్రభుత్వం మరోసారి గడువు పెంచే ప్రసక్తి లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు జిల్లా పాలనాధికారి అశిష్ సంగ్వాన్, అదనపు పాలనాధికారి (రెవెన్యూ) కిషోర్‌కుమార్‌లు సీఎంఆర్ లక్ష్యాల ప్రత్యేకంగా దృష్టి సారించారు. మిల్లర్లతో తరచూ సమావేశాలు నిర్వహించడంతోపాటు బియ్యం సేకరణ త్వరితగతిన చేసేలా ప్రతి రైస్‌మిల్లుకు ఒక తహసీల్దార్‌కు బాధ్యతలు అప్పగించినా మిల్లర్ల అలసత్వం ప్రదర్శించడంతో ఫలితం కనిపించలేదు. ఇప్పటివరకు వానాకాలం సీజన్‌కు సంబంధించి 16.35 శాతం, యాసంగి సీజన్‌కు సంబంధించి 95.65 శాతం లక్ష్యం పూర్తి చేయాల్సి ఉంది. బియ్యం సేకరణ గడువులోగా పూర్తి చేయకపోవడంతో అప్పటి ధాన్యం బస్తాలు మిల్లుల్లో ఉండగా.. ఈ ఏడాది యాసంగిలో వచ్చే ధాన్యం బస్తాలు మిల్లుల బయట ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.

**క్రమేపీ పొడిగిస్తున్నా..**

పౌర సరఫరాల సంస్థ నిబంధనల మేరకు ప్రతి సంవత్సరం సీజన్‌కు సంబంధించి ఆరు నెలల్లో మిల్లులకు కేటాయించిన ధాన్యానికి బియ్యం సేకరణ చేయాల్సి ఉన్నా.. కొంతమంది రైస్‌మిల్లర్లు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ఎఫ్‌సీఐకి అందజేయాల్సిన ఒక సీజన్‌లోని బియ్యాన్ని వాయిదా వేస్తూ మరొక సీజన్‌లో వచ్చే ధాన్యం మిల్లింగ్ చేసి ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. 2022–23 వానాకాలం సీజన్‌కు సంబంధించి సీఎంఆర్‌పై ఇప్పటివరకు అయిదారుసార్లు గడువు పొడిగించినా ఇంకా పూర్తి లక్ష్యాలు చేరుకోలేదు. గడువు ముగిసినా లక్ష్యంలో 83.65 శాతం బియ్యం అప్పగించగా.. మిగతాది పెండింగ్‌లో ఉంది. 2022–23 యాసంగి సీజన్‌లో రైస్‌మిల్లులకు కేటాయించిన ధాన్యం మరాడించడంలో మిల్లర్ల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రైస్ మిల్లులు అప్పగించాల్సిన బియ్యంలో కేవలం 4.35 శాతం మాత్రమే ఇచ్చారు. మరో రెండు నెలలు పొడిగించినా.. ఆలోపు పూర్తి మిల్లింగ్ సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. 2023–24 వానాకాలం సీజన్‌కు సంబంధించి ఇంకా రైస్ మిల్లులకు 1,42,759 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా.. క్వింటాలుకు 67 కిలోల చొప్పున 95,648 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ అప్పగించాల్సి ఉన్నా.. ఇప్పటివరకు ఈ ప్రక్రియ మొదలే కాలేదు.

**నోటీసులు జారీ చేసినా మారని తీరు..**

సారంగాపూర్ మండలంలోని ఓ రైస్ మిల్లుకు కేటాయించిన ధాన్యానికి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతోపాటు బియ్యం అప్పగించని కారణంగా ఆ రైస్ మిల్లు యజమానిపై కేసు నమోదు చేశారు. సీఎంఆర్ విషయంలో అలసత్వం చూపించిన పలువురు మిల్లర్లకు నోటీసులు జారీ చేసినా వారి తీరు మాత్రం మారలేదు. గత నెల 29లోగా పూర్తి లక్ష్యాలు సాధించాలని ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేసినా కొంతమంది మిల్లర్లు పట్టనట్లు వ్యవహరించడం గమనార్హం.

**మిల్లర్ల నిర్లక్ష్యం**

ప్రారంభంలో మిల్లులకు అప్పగించిన ధాన్యంపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఏ రైస్ మిల్లులో ఎంత ధాన్యం ఉందో అధికారులకే తెలియని పరిస్థితి. గడువు ముగుస్తున్న సమయంలో బియ్యం కోసం అధికారులు ఒత్తిడి చేసిన సందర్భంలో కొందరు మిల్లర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలించే రేషన్ బియ్యం క్వింటాలుకు రూ.1400 నుంచి రూ.1600 వరకు వెచ్చించి కొనుగోలు చేసి రీసైక్లింగ్ పద్ధతికి పాల్పడ్డారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా చేయడంతో శ్రమ, విద్యుత్తు బిల్లు, కార్మికుల వేతనాలు, నిర్వహణ ఖర్చు ఆదా చేసుకుంటున్నట్లు తెలిసింది. ప్రభుత్వానికి సంబంధించి 67 కిలోల బియ్యానికి క్వింటాలుకు రూ.850 వరకు అవుతుంది. ఇలా చేతికి మట్టి అంటకుండా దందా చేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు:**

శ్రీకళ, జిల్లా మేనేజరు, పౌరసరఫరాల సంస్థసీఎంఆర్ ఇవ్వని రైస్ మిల్లులపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. సీఎంఆర్‌పై మళ్లీ గడువు పొడిగించే అవకాశంపై అడగగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేవని స్పష్టం చేశారు.

## ఇసుక మాఫియా ఇష్టారాజ్యం

అయిజ : ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఇసుక అక్రమ రవాణా జోరు తగ్గడంలేదు. రాత్రింబవళ్లు తేడా లేకుండా అడ్డదారుల్లో రవాణా చేస్తున్నారు. మాఫియాకు అన్ని రకాల అడ్డదారులు తెలిసుండటమే దీనికి కారణం. తుంగభద్ర నదిలో అధికారికంగా గద్వాల జిల్లా వ్యాప్తంగా ఆరు రీచ్‌లు ఏర్పాటు చేశారు. మరో ఆరుచోట్ల అడ్డదారిన అక్రమార్కులు ఇసుకను తోడేస్తున్నారు. రోజుకు రూ.5.40 లక్షల మేర ప్రభుత్వాదాయానికి గండి పడుతోంది. పెద్దల అండదండలు ఉండటంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా నడిచింది. ఇసుక మాఫియా వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఇటీవల కాలంలో ఇసుక అక్రమ రవాణ వాహనాలు అధిక సంఖ్యలో పట్టుబడుతుండటమే దీనికి కారణం.

**అడ్డదారులే లక్ష్యంగా..:** తుంగభద్ర నది నుంచి అడ్డదారుల్లో ఇసుకను తరలిస్తూ చివరకు హైదారాబాదు వరకు తీసుకెళ్తున్నారు. నది నుంచి ఎక్కడెక్కడ అడ్డదారులున్నాయి, ఏయే మండలాల పరిధిలో దారులు ఎలా ఏర్పాటు చేశారనేదానిపై అధికారులు తాజాగా ఆరా తీస్తున్నారు. ప్రధాన రహదారుల్లో అయితే అధికారుల కంటపడతారని ట్రాక్టర్లను అడ్డదారుల్లో తరలిస్తున్నారు. కొన్ని చోట్ల ఏకంగా పొలాల్లో అడ్డదిడ్డంగా తీసుకెళ్తున్నారు. వేసవిలో పంటలు లేకపోవడం, నదిలో నీళ్లు లేకపోవడం ఇసుక మాఫియాకు కలిసొచ్చింది. దాడుల్లో అడ్డదారుల్లో నుంచి వచ్చి దొరికిన ట్రాక్టర్‌లే ఉంటున్నాయి. అధికారులు నేరుగా అనధికారిక రీచ్‌లపై దాడులు కొనసాగిస్తున్నారు.

**ఇవే అనధికారికి రీచ్‌లు..:** గద్వాల జిల్లాలోని తుంగభద్ర నదిలో అధికారికంగా ఆరు ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేశారు. అయిజ మండలంలోని వేణిసోంపూర్, రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, రాజోలి, తూర్పుగార్లపాడు, ఉండవల్లి మండలంలోని పుల్లూరు గ్రామాల సరిహద్దులోని నది వద్ద అధికారులు రీచ్‌లను ఏర్పాటు చేశారు. రీచ్‌ల నుంచి ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుకను తోడేస్తున్నాయి. ఎక్కడపడితే అక్కడ తోడి పెద్దపెద్ద గోతులు చేసేస్తున్నారు. నిబంధనల ప్రకారం మైనింగ్ శాఖ పేరుతో మీసేవలో ఒక కిలోమీటర్ దూరానికి రూ.85 చెల్లించాలి. గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లోని గ్రామాలకు ఇసుక చేరేందుకు ఆన్‌లైన్ చెల్లింపు ద్వారా ఒక ట్రాక్టర్ ఇసుకకు రూ.3,500 నుంచి రూ.4,000 వరకు వ్యయం అవుతోంది.

**రూ.1.62 కోట్ల అక్రమం..:** ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న ట్రాక్టర్లు ఆఫ్‌లైన్ ద్వారా ఇసుకను చేరవేస్తున్నాయి. జిల్లాలోని ఆరు రీచ్‌ల పరిధిలో సుమారు 1,200 ట్రాక్టర్లు ఇసుకను తరలించేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయి. దాదాపు 30 శాతం అక్రమ మార్గంలో తరలిస్తున్నారు. రోజుకు సుమారు 360 ట్రాక్టర్ల ఇసుక అక్రమ మార్గంలో తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తే రూ.1,500 ప్రభుత్వ ఖాతాలో జమవుతుంది. ఈ ప్రకారం రోజూ రూ.5.40 లక్షలు అంటే నెలకు రూ.1.62 కోట్ల మేర, ఏడాదికి రూ.19.71 కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది.

**నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు:** ఇసుక తరలింపులో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకొంటాం. అనుమతి లేకుండా తరలిస్తే వెంటనే కేసులు నమోదు చేస్తాం. ఇసుక ర్యీ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశాం. ఎక్కడికక్కడ అక్రమ తరలింపును అడ్డుకుంటాం. విజయ రామరాజు, మైనింగ్‌శాఖ ఏడీ, గద్వాల జిల్లా

## అమ్మో జింక.. ఎన్నాళ్లింక

ఊట్కూరు: కృష్ణానది పరివాహక ప్రాంతంలో జింకలు రైతులను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి పంటపొలాలపై పడి నాశనం చేస్తున్నాయి. ఈ విషయమై ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదో ఒక సాకుచెప్పి ఈ అంశాన్ని దాట వేస్తున్నారు. నిరసన వ్యక్తం చేస్తే కేసులు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. సమస్య పరిష్కారానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హామీ ఇవ్వడంతో జింకల తరలింపుపై ఆశలు చిగురిస్తున్నాయి. పచ్చిక బయళ్లు ఆవాసంగా చేసుకుని మనుగడ సాగించే జింకలు ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా వృద్ధి చెందాయి. అడవులను వదిలి వ్యవసాయక్షేత్రాలలో మనుగడ సాగించే స్థాయికి వాటిసంఖ్య పెరగడంతో పదేళ్లుగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టా భూములలో వ్యవసాయం చేయలేని పరిస్థితి తలెత్తింది. గతంలో అడవులలో ఆవాసం ఉండే వాటిని వేటగాళ్లు మట్టు పెడుతుండటంతో పర్యావరణవేత్తలు ఆందోళన చెందారు. మూడుదశాబ్దాల క్రితం వాటి సంతతి చాలా తక్కువగా ఉండేది. పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని భావించి 1975లో వన్యప్రాణి సంరక్షణ చట్టం కిందకు తీసుకొచ్చారు. వేటపై నిషేధం విధించారు. వాటి సంతతి పెరిగినా అందుకు తగ్గ ఏర్పాట్లు మాత్రం చేయలేదు. కృష్ణా నదీతీరంలో వందల ఎకరాల భూములలో పంటలు వేసుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు వాటిని ఇక్కడ నుంచి తరలించాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తుంగభద్ర నదీతీరంలో జింకలకు పునరావాస కేంద్రం ఏర్పాటుకు గతంలో చర్యలు చేపట్టారు. సుమారు 671 హెక్టార్లలో రూ.28 కోట్లతో వాటి ఆవాసానికి ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ఒక కార్యాలయంతో పాటు జింకలకు అవసరమైన గడ్డి పెంపకం, నీటి వసతి, కంచె ఏర్పాటు చేయడానికి పూనుకున్నారు. రానురానూ ఆ కేంద్రంపై శ్రద్ధ పెట్టకపోవడంతో అనుకున్న ఫలితం రాలేదు.

**మన వద్ద ఇలా...**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధికంగా ఉన్న జింకల సంరక్షణ కోసం నారాయణపేట జిల్లా కృష్ణా మండలం ముడుమాల్ వద్ద 74 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. వాటి సంరక్షణ కోసం ఇక్కడ అన్ని వసతులూ ఏర్పాటు చేయవచ్చని అటవీ శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. వాటి ఆహారం కోసం పచ్చిక పెంపకం, నీటి కోసం తొట్లు, వాచ్‌టవర్, సీసీ కెమెరాల ఏర్పాట్లు కోసం ప్రతిపాదనలు పంపించారు. ఏళ్లు గడుస్తున్నా అడుగుముందుకు పడలేదు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇతర ప్రాంతాల్లో అధ్యయనం చేస్తామని చెప్పిన నేపథ్యంలో నేపాల్ అనుభవాన్ని గమనంలోకి తీసుకోవచ్చు. అందుకు అనుగుణంగా ముడుమాల్ సంరక్షణ కేంద్రాన్ని తీర్చిదిద్దితే రైతులకు మేలు కలుగుతుంది.

**జాగ్రత్త పడిన నేపాల్:** భారతదేశంలోనే అత్యధికంగా ఉండే జింకలు ఉపఖండం మొత్తం వ్యాపించాయి. చిన్న చిన్న మందలుగా విడిపోవడంతో వాటి సంతతి చాలా తక్కువగా ఉండేది. వేటగాళ్ల వల్ల చాలా వరకూ మృతి చెందేవి. 1975కు ముందు వాటి పరిస్థితి ఇది. తరువాత అవి విస్తృతమయ్యాయి. 2009లో నేపాల్ దేశంలోని బర్దియా జిల్లాలో 9 జింకల మందలను గుర్తించి వాటిని నేరుగా కృష్ణసార్ కన్జర్వేషన్ ఏరియాకు తరలించారు. 172 ఎకరాలలో ఈ సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు జింకల సంఖ్యకు అనుగుణంగా విస్తరించుకుంటూ వెళ్తున్నారు. మొదట్లోనే అక్కడ కట్టడి చేశారు

**తరలింపునకు ప్రతిపాదనలు:** కృష్ణానదీతీరంలో జింకలను రైతులకు ఇబ్బంది కలగకుండా రక్షిత ప్రాంతంలోకి తరలించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇందుకు అనుగుణంగా ప్రతిపాదనలు పంపించాం. మిగతా వన్యప్రాణుల్లా తరలించడానికి వీలుండదు.

# ఎల్‌ఆర్‌ఎస్‌కు.. పచ్చజెండా!

ఆసిఫాబాద్ : ఎల్‌ఆర్‌ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈనెల 31వ తేదీలోపు వీటిని పరిశీలించి క్రమబద్ధీకరించాలన్న సీఎం ఆదేశాలతో ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులకు ఊరట కలిగినట్లయింది.కొందరు భూ వ్యాపారులు అనధికార వెంచర్లు వేసి ప్లాట్లు విక్రయించారు. వీటిని కొనుగోలు చేసిన ప్రజలు నిర్మాణాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇలాంటి వాటిని క్రమబద్ధీకరించేందుకు భారాస ప్రభుత్వం 2020 ఆగస్టులో ఎల్‌ఆర్‌ఎస్ అమలుకు శ్రీకారం చుట్టింది. ఇందుకు ప్లాటు కలిగిన వారు దరఖాస్తుతో పాటు రూ.వెయ్యి, వెంచర్ కలిగిన వారు రూ.పది వేలతో పాటు దరఖాస్తు చేసుకునేందుకు అదే ఏడాది సెప్టెంబరు 15వ తేదీ వరకు అవకాశం కల్పించింది. దీంతో చాలా మంది పురపాలికలు, నగరపాలికలు, పంచాయతీల్లో దరఖాస్తులు చేసుకున్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు దరఖాస్తుల పరిశీలించాల్సి ఉండగా.. కొందరు కోర్టును ఆశ్రయించడంతో మరుగున పడింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా ఈ దరఖాస్తులను పరిశీలించాలని నిర్ణయించడంతో.. వీటిలో కదలిక వచ్చే అవకాశం కనిపిస్తోంది.

96 లేఅవుట్లకు అనుమతుల్లేవు!



భూ క్రమబద్ధీకరణ కోసం భారాస ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు సైతం అప్పట్లో క్షేత్ర స్థాయిలో అనుమతులు లేని లేఅవుట్లు, ప్లాట్ల వివరాలను సేకరించారు. జిల్లాలోని 335 పంచాయతీల్లో 98 లేఅవుట్లను అప్పుడు అధికారులు గుర్తించారు. వీటిలో 328 ఎకరాల్లో 5,068 ప్లాట్లు ఉన్నట్లు లెక్కలు తీశారు. వీటిలో రెండు మినహా మిగతా 96 లేఅవుట్లకు అనుమతులు లేనట్లుగా అధికారులు తేల్చారు. వాస్తవానికి వెంచర్లు ఏర్పాటు చేసే నిర్వాహకులు నిబంధనల ప్రకారం.. పది శాతం భూమిని పురపాలిక, పంచాయతీలకు అప్పగించాలి. వెడల్పాటి రోడ్లు నిర్మించాలి. ఇతర అన్ని సౌకర్యాలు కల్పించి ప్లాట్లు విక్రయించాలి. కానీ ఇవేమీ పట్టకుండా, ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే చాలా మంది వెంచర్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. కొందరైతే అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ప్రభుత్వ భూములను సైతం ఆక్రమించి అక్రమంగా వెంచర్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేసిన అమాయక ప్రజలు తరువాత ఇబ్బందులు పడుతున్నారు.

క్రమబద్ధీకరిస్తే.. అదనపు ఆదాయం

దరఖాస్తులను పరిశీలించి భూములను క్రమబద్ధీకరిస్తే.. ఇటు పంచాయతీలు, పురపాలికలకు అదనపు ఆదాయం సమకూరుతుంది. అప్పటి మార్కెట్ విలువలను బట్టి ప్రభుత్వం రుసుములు ఖరారు చేసింది. మొదట ప్లాటుకు రూ.వెయ్యి చొప్పున, లే అవుట్‌కు రూ.పది వేల చొప్పున ఫీజు చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలన్న ప్రభుత్వ ఆదేశాలతో అప్పట్లో జిల్లాలో సుమారు 2,872 దరఖాస్తులు రాగా.. కాగజ్‌నగర్ పురపాలికలో 2,180 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అప్పట్లో కొంత పరిశీలన జరిగినా.. కొందరు కోర్టును ఆశ్రయించడంతో ప్రక్రియ నిలిచిపోయింది. తాజా ప్రభుత్వ ఆదేశాలతో వీటిలో కదలిక వచ్చే అవకాశం కనిపిస్తోంది. అయితే ఇప్పటి వరకు వీటికి సంబంధించి నిబంధనలేమీ ప్రభుత్వం జారీ చేయనట్లు జిల్లా అధికారులు చెబుతున్నారు.

# ఆర్మూర్ పురపాలకంపై స్పష్టతకు లేఖ

నిజామాబాద్: ఆర్మూర్ మున్సిపాలిటీలో అవిశ్వాస పరీక్ష అనంతరం తలెత్తిన వివాదంపై స్పష్టత కోసం కలెక్టర్ పురపాలకశాఖకు లేఖ రాశారు. ఈ వివాదం హైకోర్టును చేరి.. అక్కడ సింగిల్ జడ్జి నుంచి ఆర్డర్ వెలువడిన విషయం తెలిసిందే. 2/3 వంతు సభ్యుల సంఖ్య విషయంలో వివాదించి మొత్తం సభ్యుల్లో కాదు.. హాజరైన సభ్యుల్లో 2/3 వంతు మద్దతు ఉంటే అవిశ్వాసం నెగ్గినట్లే అనే వాదనను సమర్థించింది. దీనిపై చైర్‌పర్సన్ వర్గం డివిజన్ బెంచ్‌కు వెళ్లినప్పటికీ ఈ అంశంపై జోక్యానికి ద్విసభ్య ధర్మాసనం నిరాకరించింది. ఏదైనా ఉంటే సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోవాలంది. 25 మంది సభ్యుల మద్దతు లేని కారణంగా అవిశ్వాసం నెగ్గనట్లే అని ఇచ్చిన ఉత్తర్వులను పురపాలకశాఖ గత నెల 17న వెనక్కి తీసుకుంది. ఈ క్రమంలో పురపాలక సంఘంలో చైర్‌పర్సన్ పదవి విషయంలో ఎలా ముందుకు వెళ్లాలనేది స్పష్టత లోపించింది. ఈ నేపథ్యంలోనే తగిన సూచనలు చేయాలంటూ



జిల్లా పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు ప్రభుత్వానికి (పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శికి) లేఖ రాశారు.

ఆలస్యంతో ఇబ్బందులు అవిశ్వాసంపై కోర్టు ఇచ్చిన ఆర్డర్ మేరకు అధికారులు ముందుకెళ్లాల్సి ఉంటే చైర్‌పర్సన్ పదవి ఖాళీ అయినట్లు ప్రభుత్వం నోటిఫై చేయాల్సి ఉంటుంది. అప్పటివరకు చైర్‌పర్సన్ ఎన్నిక నోటిఫికేషన్ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేని పరిస్థితి. ఇది జరిగితేనే తాత్కాలికంగా వైస్ చైర్‌పర్సన్‌కు బాధ్యతలు అప్పగించే అవకాశం కూడా ఉంటుంది. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న సందర్భంలో బడ్జెట్ సమావేశాలు కూడా నిర్వహించుకొని తీర్మానాలు చేయాల్సి ఉంది. ఇందుకు పాలకవర్గంలో చైర్‌పర్సన్ లేదా ఇన్‌ఛార్జి చైర్‌పర్సన్ హోదా వారు ఉండాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం నుంచి సూచనలు వచ్చాకే ముందుకు వెళ్లాలని అధికారులు వేచి చూస్తున్నారు. మరోపక్క సింగిల్ జడ్జి ఇచ్చిన ఆర్డర్‌పై డివిజన్ బెంచ్‌కు వెళ్లిన చైర్‌పర్సన్ వర్గానికి సింగిల్ జడ్జి వద్ద వాదనలు వినిపించుకోవాలని న్యాయమూర్తులు చెప్పారు. ఈ క్రమంలో వారు ఇంకా ఏవైనా ఆధారాలతో అప్పీల్ చేసే ప్రయత్నాలు చేసే అవకాశం ఉండగా.. చూడాల్సి ఉంది. ఈ క్రమంలో పురపాలకశాఖ ప్రభుత్వ న్యాయవాది సలహా తీసుకున్నాకే జిల్లా కలెక్టర్‌కు ఎలాంటి నిర్ణయాలు అమలు చేయాలో చెప్పే అవకాశం ఉండటున్నారు.

# పరిస్థితులు తారుమారు.. అభ్యర్థులు ఎవరవుతారు?




సిద్దిపేట : జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి భారాస తరపున వరుసగా రెండు పర్యాయాలు విజయం సాధించిన సిట్టింగ్ ఎంపీ బీబీపాటిల్ భాజపాలో చేరడంతో నియోజకవర్గంలో ఒక్కసారిగా రాజకీయ పరిస్థితులు ఆసక్తికరంగా మారాయి. అతి త్వరలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యే అవకాశం ఉన్నందున ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపిక కసరత్తు ఉద్ధృతం చేశాయి. భాజపా, కాంగ్రెస్‌ల తరఫున కొత్త ముఖాలు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, భారాస తరఫున సిట్టింగ్ ఎంపీ అయిన బీబీపాటిల్‌కే ఎక్కువ అవకాశాలు ఉంటాయని ఇంతకాలం చర్చలు సాగాయి. అకస్మాత్తుగా ఆయన భాజపాలో చేరడంతో భారాస సైతం కొత్త అభ్యర్థులను వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వరుసగా రెండు సార్లు గెలిచిన పాటిల్.. 2008లో కొత్తగా ఏర్పాటైన జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోకి సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్‌ల్‌తో కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాలను చేర్చారు. 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన సురేష్‌షెట్కార్ గెలుపొందారు. 2014లో కాంగ్రెస్ నుంచి తిరిగి షెట్కార్ బరిలో నిలవగా, అప్పటి వరకు ఈ ప్రాంతానికి అంతగా పరిచయం లేని బీబీపాటిల్ పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. ఆ వెంటనే ఆయన భారాస టిక్కెట్టును చేజిక్కించుకుని ఘన విజయం సాధించారు. 2019లో జరిగిన ఎన్నికల్లోనూ తెరాస నుంచి ఆయనే మళ్లీ పోటీకి దిగి, కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావుపై విజయం సాధించారు. ఇక్కడి నుంచి వరుసగా రెండు పర్యాయాలు ఎంపీగా కొనసాగారు. డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం భారాసను వీడుతారనే ప్రచారం ఊపందుకుంది. అందరి ఊహలను నిజం చేస్తూ.. ఇటీవల దిల్లీలో భాజపా తీర్థం పుచ్చుకున్నారు.

ఈసారి .. రెండు నెలల క్రితం రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారాస అధికారాన్ని కోల్పోవడం, జాతీయ స్థాయిలో భాజపాకు అనుకూల వాతావరణం ఉందన్న ప్రచారం నేపథ్యంలో బీబీపాటిల్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్థానికంగా చర్చ నడుస్తోంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో నాలుగు చోట్ల కాంగ్రెస్, రెండుచోట్ల భారాస, ఒక్క స్థానంలో భాజపా విజయం సాధించాయి. కాని పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్, భారాసల కంటే భాజపా నుంచి టిక్కెట్టు ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంది. భాజపా తరపున బీబీపాటిల్‌కే టిక్కెట్టు వస్తుందని ఆయన అనుచరులు ధీమాతో ఉన్నారు. ఆయనకు జహీరాబాద్ లేదా మహారాష్ట్రలోని నాందేడ్ నియోజకవర్గాల్లో ఎక్కడో ఒక్క చోట నుంచి అవకాశం ఇస్తారన్న ప్రచారం ఉంది.

కొత్త అభ్యర్థి వెతుకులాటలో భారాస.. బీబీపాటిల్ పార్టీ మారడంతో భారాస కొత్త అభ్యర్థిని ఎంపిక చేయాల్సి వచ్చింది. మాజీ శాసనసభాపతి తనయుడితో పాటు మరో ఐదుగురు టిక్కెట్టును ఆశిస్తున్నట్లు తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ పార్టీ ఆచితూచి అడుగులు వేస్తోందని సమాచారం. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో విజయంతో ఊపుమీదున్న ఆ పార్టీ నుంచి టిక్కెట్టును ఆశిస్తూ ఆరుగురు ఆశావహులు ఇటీవల టీపీసీసీకి దరఖాస్తులు సమర్పించారు. ఇందులో మాజీ ఎంపీ నారాయణఖేడ్‌కు చెందిన సురేష్ షెట్కార్, జహీరాబాద్‌కు చెందిన ఎన్నారై ఉజ్వల్‌రెడ్డితోపాటు ఓ మంత్రి తన వారసుణ్ని పోటీలో దింపేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

# వసతుల కల్పనలో తడబడి



దుబ్బాక : ప్రైవేటుగా దీటుగా మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు.. మన బడి' పథకం లక్ష్యాన్ని చేరడం లేదు. నిధులు లేక ముందడుగు పడటం లేదు. జిల్లాలో 2022లో పనులకు శ్రీకారం చుట్టగా.. ఆగుతూ సాగుతున్నాయి. గతేడాది మేలో తొలి విడత పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినా.. ఎక్కడా కాలేదు. 8 నెలలుగా పనుల్లో పురోగతి కొరవడింది.మొదటి విడతగా..పథకం కింద జిల్లాలో మొదటి విడతగా 184 (ప్రాథమిక, 33 ప్రాథమికోన్నత, 124 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. వివిధ రకాల పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.83.45 కోట్లు, ఉపాధిహామీ కింద రూ.42 కోట్ల కేటాయించింది. ఇప్పటి వరకు కేవలం 30 శాతం బడుల్లో పనులు పూర్తయ్యాయి. విద్యాశాఖ వివిధ దశల్లో పర్యవేక్షిస్తుండగా.. పీఆర్, ఆర్‌అండ్‌బీ, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ నేతృత్వంలో పనులు చేపట్టారు. తొలుత 343 బడులు ఎంపిక కాగా.. స్థలాభావంతో రెండింటిని జాబితా నుంచి తొలగించారు. అప్పట్లో రూ.30 లక్షలలోపు పనులైతే ఎస్‌ఎంసీ, సర్పంచులు, ఆ నిర్దేశిత మొత్తం దాటితే గుత్తేదారుకు కేటాయించారు. రూ.30 లక్షల చొప్పున నిధులతో 97 బడులకు మరమ్మతులు చేశారు. ఈ విషయమై డీఈవో శ్రీనివాస్‌రెడ్డిని సంప్రదించగా.. పనులు పూర్తి చేసే అంశంపై దృష్టి సారిస్తామన్నారు. విషయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

దుబ్బాక మండల పరిషత్తు బాలికల ప్రాథమిక పాఠశాలలో రూ.42 లక్షలతో రెండు అదనపు తరగతి గదులు, వంట గది, శౌచాలయాలు, ప్రహరీ పనులు చేపట్టారు. 70 శాతం పనులు పూర్తి కాగా.. బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు వదిలేశారు. దుంపలపల్లి ప్రాథమిక పాఠశాలలో గదుల కొరత వేధిస్తోంది. పోతారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో కేవలం పునాది వరకే నిర్మించారు.

గజ్వేల్ మండలంలో 20 బడులను ఎంపిక చేయగా.. అయిదింట పనులు పూర్తయ్యాయి. మిగిలిన పదిచోట్ల అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రజ్ఞాపూర్ బాలికల ఉన్నత పాఠశాలలో వంట గది పూర్తి కాలేదు. నంగునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించినా బెంచీలు ఏర్పాటు చేయలేదు. వంట గది పిల్లర్లకే పరిమితమైంది. ఇక్కడ ఒకే శౌచాలయం ఉంది. ప్రహరీ నిర్మించలేదు. తాగునీటి వసతి లేదు.

అక్కన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో శౌచాలయాలు స్లాబ్ దశకే పరిమితమయ్యాయి. నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు.

చేర్యాల మండలం ముస్త్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.కోటితో వివిధ రకాల పనులు చేశారు. అదనపు తరగతి గదుల భవనం అసంపూర్తిగా మారింది. డైనింగ్‌హాల్ కోసం చేపట్టిన రేకుల షెడ్డు నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది.

# ఆగిన పనులు.. అందని సాగునీరు

సిద్దిపేట : రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన కొండపోచమ్మ జలాశయ పంట కాలువల నిర్మాణం అసంపూర్తిగా మారడంతో సాగునీరు అందక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని మర్కూక్ మండలంలో నిర్మించిన కొండపోచమ్మ సాగర్ ద్వారా మర్కూక్, జగదేవపూర్ మండలాల్లోని 11,800 ఎకరాలకు సాగునీరు అందించాలని అప్పటి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా జలాశయం పూర్తి చేసి ఇక్కడి నుంచి జగదేవపూర్ వరకు ప్రధాన కాలువలు నిర్మించారు. మండల పరిధిలోని తీగుల్, గొల్లపల్లి, బీజీ వెంకటాపూర్, తిమ్మాపూర్, మునిగడప సాగునీరు అందాలంటే మరికొంత భూసేకరణ అవసరమని అధికారులు భావిస్తున్నారు. పలుచోట్ల అసంపూర్తిగా ఉన్న కాలువల నిర్మాణ పనులు ఇటీవల కొంతవరకు చేశారు. పూర్తిస్థాయిలో పనులు కావడానికి మరో రెండుచోట్ల 14 గుంటల భూమి అవసరమని అధికారులు చెబుతున్నారు. మండలంలోని గొల్లపల్లి వద్ద 8 గుంటలు, మునిగడపలో 6 గుంటలు భూసేకరణ చేయాల్సి ఉంది. కాలువల విస్తరణకు అవసరమైన భూమిని ఇవ్వడానికి రైతులు విముఖత చూపుతుండడంతో నిర్మాణ పనులు నిలిచాయని అంటున్నారు. మార్కెట్ విలువ ఆధారంగా భూమి ధర కట్టివ్వాలని రైతులు కోరుతున్నారు. వారి వినతిని పరిగణనలోకి తీసుకోకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఫలితంగా చిన్నపాటి పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు. సాగునీటి కోసం ఎదురుచూపులు తప్పడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. త్వరగా భూసేకరణ పూర్తి చేసి ప్రధాన, పిల్ల కాలువలు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.అన్నదాతలతో మాట్లాడుతున్నాం..అరుణ్, ఏఈ, నీటిపారుదల శాఖపూర్తిస్థాయిలో కాలువలు నిర్మిస్తే సాగునీరివ్వడం సాధ్యం. గొల్లపల్లి, మునిగడప పరిసరాల్లో రెండు చోట్ల కొంత భూమి అవసరముంది. సంబంధిత రైతులకు సేకరణ సమాచారం ఇచ్చాం. ఇద్దరు రైతులతో మాట్లాడుతున్నాం. వారు అంగీకరిస్తే నిర్మాణ పనులు ముందుకు సాగుతాయి. పిల్ల కాలువల నిర్మాణమూ ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

# వరికి నీరెలా..!

మహబూబ్‌నగర్: నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం ఎమ్మెన్‌పల్లికి చెందిన రైతు సాయికుమార్ నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఇప్పటి వరకు రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. పంట వేసే సమయంలో బోరు నుంచి నీళ్లు బాగా రావడంతో సాగుకు సిద్ధమయ్యారు. ఇటీవల బోరు నుంచి నీళ్లు రాకపోవడంతో కొత్త బోర్లు వేశారు. వాటిలో కూడా చుక్క నీరు పడలేదు. ఏం చేయాలో తోచక పంటను మధ్యలోనే వదులుకోవాల్సి వచ్చింది.

వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం కొత్తపేటకు చెందిన రైతు తిరుమల్ యాదవ్ మూడున్నరెకరాల్లో వరి సాగు చేస్తున్నారు. బోర్లు ఉండటంతో ధైర్యంగా సాగు ప్రారంభించి ఇప్పటి వరకు రూ.60 వేలు ఖర్చు చేశారు. బోర్ల నుంచి నీళ్లు రాకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచక పంటను పొట్ట దశలోనే వదిలేశారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ప్రధాన ఎత్తిపోతల పథకాల కింద సాగునీటి సరఫరా లేకపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలువురు పంటను మధ్యలోనే వదిలేస్తున్నారు. పొట్టదశ కూడా రాకముందే పొలం నెర్రలుబారుతుండటంతో పంటపై ఆశలు వదులుకుంటున్నారు. ప్రస్తుతం జూరాల, శ్రీశైలం జలాశయాలు నిండుకున్నాయి. తాగునీటి సరఫరాకే ఇబ్బందులు నెలకొన్నాయి. సాగుకు చుక్క నీరు అందించే పరిస్థితి లేదు. కర్ణాటకలో పంట విరామం ప్రకటించడంతో దిగువకు సాగునీటిని వదిలే పరిస్థితి లేదు. పాలమూరు రైతులు సాగునీటి కోసం దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ యాసంగిలో 7.11 లక్షల ఎకరాలు సాధారణ సాగు విస్తీర్ణం ఉండగా 7.08 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. మొత్తం సాగులో 99 శాతం పంటలను సాగు చేయగా వరి పంట్ 4.51 లక్షల ఎకరాల్లో వేశారు. ఈ పంట సాధారణ విస్తీర్ణం 4.03 లక్షల ఎకరాలు ఉండగా 14శాతం అదనంగా ఈ పంటను సాగు చేయడం విశేషం.

మంచి ధర ఉండటంతో..

మార్కెట్‌లో మంచి ధర ఉండటంతో పాలమూరు రైతులు వరి వైపు మొగ్గు చూపారు. నీటిపారుదల శాఖ అధికారులు ఈ యాసంగిలో ఎత్తిపోతల పథకాల పరిధిలోని ఆయకట్టులో సాగునీరు అందించే



పరిస్థితి లేదని ముందే చెప్పారు. కల్వకుర్తి, కోయిల్‌సాగర్, భీమా, నెట్టెంపాడు, ఆర్డీఎస్ పథకాల కింద సుమారు 7 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఏటా యాసంగిలో అధికారులు ఐవీబీ సమావేశం ఏర్పాటు చేసి కనీసం 4లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని ప్రకటన చేస్తారు. జలాశయాల్లో నీళ్లు లేకపోవడంతో సాగునీరు సరఫరా చేయడం లేదు. చాలామంది రైతులకు పొలాల్లో బోర్లు ఉన్నాయి. పంట వేసే సమయంలో బోర్ల నుంచి నీళ్లు సంవృద్ధిగా వస్తుండటంతో వరి వేశారు. మూడు నెలలుగా భూగర్భ జలాలు అమాంతం పడిపోతున్నాయి. గత నెలలో మహబూబ్‌నగర్‌లో 8.88 మీటర్లు, నాగర్‌కర్నూల్‌లో 8.64 మీటర్లు, నారాయణపేటలో 7.74 మీటర్లు, జోగులాంబ గద్వాల్‌లో 6.53 మీటర్లు, వనపర్తిలో 4.80 మీటర్ల లోతుల్లోకి జలాలు పడిపోయాయి. ఫిబ్రవరిలో మరో రెండు మీటర్ల లోతుల్లోకి నీళ్లు పోవడంతో చాలాచోట్ల బోర్లు మొరాయిస్తున్నాయి. ఇప్పటికే ఎకరాకు రూ.10-20 వేల వరకు ఖర్చు చేశారు. పొట్ట దశ వచ్చే సరికి బోర్ల నుంచి నీళ్లు రాకపోతుండటంతో మధ్యలోనే పంటల్ని వదిలేస్తున్నారు. మరికొందరు రైతులు ఎకరా లేదా రెండెకరాల్లో మాత్రమే వరి సాగు చేస్తున్నారు. పూర్తిస్థాయిలో పంట చేతికొచ్చే సరికి కనీసం ఒకటి నెలలైనా పట్టే అవకాశం ఉంది. ఆ లోగా భూగర్భ జలాలు పూర్తిగా పడిపోతే పెట్టుబడి కూడా రాదేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# కస్తూర్బాలకు రూ.8.83 కోట్లు

గద్వాల : బిల్లులు రాకపోవడంతో గద్వాల జిల్లాలోని అయిదు కస్తూర్బాల్లో గుత్తేదారు జనవరి నుంచి విద్యార్థులకు వారానికోసారి ఇచ్చే మాంసాహారం అందించడం లేదు. ఫలితంగా విద్యార్థినులు పోషకాహారానికి దూరం అవుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని మరికొన్ని చోట్ల ఇదే పరిస్థితి ఉంది. నిర్వహణకు నిధులు రాక కస్తూర్బాల్లో సమస్యలు అలానే ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నాలుగు నెలలకు సంబంధించిన నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసిందని గద్వాల జిల్లా కస్తూర్బాల సమన్వయకర్త ఫర్హానాభేగం పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో..: మొత్తం 72 కస్తూర్బా గాంధీ విద్యాలయాలున్నాయి. ఒక్కో పాఠశాలలో 6 నుంచి పదో తరగతి వరకు 14,200 మంది బాలికలు చదువుతున్నారు. 3,600 మందికిపైగా ఇంటర్ చదువుతున్నారు. ఒక్కో విద్యార్థికి నెలకు పోషకాహారానికి రూ.1,225,



ఒక ఇక్కో పాఠశాలకు విద్యుత్తు, తాగునీటికి రూ.10 వేలు, మరుగుదొడ్లు, స్నానపు గదుల నిర్వహణకు రూ.వెయ్యి, అంతర్జాలం, పత్రికల కోసం రూ.1,200, వైద్య సేవలు, ల్యాబ్, స్టేషనరీ సామగ్రి కొనుగోలుకు రూ.10 వేలు అవసరం అవుతాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల హాజరు ఆధారంగా ప్రస్తుతం డైట్, నిర్వహణ నిధులు సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు ఉమ్మడి జిల్లాకు రూ.8.83 కోట్లు మంజూరయ్యాయి. వీటితో పాటు గెస్ట్ ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తున్న వారికి సైతం వేతనాలు విడుదలయ్యాయి.




## తెలుగు రాష్ట్రాల్లో శివరాత్రి శోభ.. శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

హైదరాబాద్/విజయవాడ: తెలుగు రాష్ట్రాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగుతున్నాయి. శుక్రవార ఉదయం నుంచే భక్తులు శివాలయాలకు పోటెత్తారు. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. లింగాకార రూపుడైన శివునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు
**అంబేద్కర్ కోనసీమ జిల్లా:** శివనామ స్మరణతో కోటిపల్లి, ద్రాక్షారామ పుణ్యక్షేత్రాలు మార్మోగాయి. మహాశివరాత్రినీ పురస్కరించుకొని కోటిపల్లి ద్రాక్షారామం ఆలయాలలో క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు. వేకువజామున నుంచి భక్తులు పుణ్య స్థానాలు ఆచరించి స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు.
**నంద్యాల:** మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనానికి భక్తజనం బారులు తీరారు. వేకువజాము నుండి పాతాళగంగ స్నాన ఘట్టాల వద్ద శివ భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. శ్రీశైలంలో నేడు పాగాలంకరణ, కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. శివనామస్మరణతో శ్రీగిరి క్షేత్రం మార్మోగుతోంది.

ఈ నెల 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. శ్రీశైల క్షేత్రంలో స్వామి అమ్మవార్ల దర్శనానికి నాలుగు గంటల సమయం పడుతోంది.
**కరీంనగర్:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ రాజన్న సన్నిధి భక్త జనసంద్రంగా మారింది. మూడు రోజుల పాటు జరుగనున్న జాతరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నిన్న గురువారం సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం పట్టువస్త్రాల సమర్పించింది. మరో వైపు పంచాక్షరీ నామస్మరణతో రాజన్న సన్నిధి మార్మోగుతోంది.
**హైదరాబాద్‌లోని పలు ఆలయాల్లో భక్తుల రద్దీ :** మహా శివరాత్రి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. హైదరాబాద్‌లోని పలు ఆలయాల్లో పరమశివుడిని కొలుస్తూ భక్తులు రుద్రాభిషేకాలు చేస్తున్నారు.

## లోక్‌సభ ఎన్నికలు.. రాష్ట్రంలో నలుగురు అభ్యర్థులతో కాంగ్రెస్ తొలి జాబితా విడుదల

లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితాను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. దేశ వ్యాప్తంగా 36 మందితో కూడిన జాబితా విడుదలైంది. తెలంగాణలో మొత్తం 17 పార్లమెంట్ స్థానాలకు గానూ తొలి జాబితాలో కేవలం నాలుగు స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది కాంగ్రెస్ అధిష్ఠానం. జహీరాబాద్ - సురేష్ షెట్కార్, నల్లగొండ - కుందూరు రఘువీర్, మహబూబాబాద్ - బలరాం నాయక్, చేవెళ్ల - సునీత మహేందర్ రెడ్డి.



## ప్రజాపాలనలో మహిళల భాగస్వామ్యం పెరిగింది: సీఎం రేవంత్




హైదరాబాద్: ప్రజా పాలనలో మహిళల ప్రాతినిథ్యం, భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలను అభివృద్ధి, ప్రగతి పథంలో తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోందన్నారు. మహిళల సాధికారితతో పాటు ఆర్థిక స్వాలంబనకు మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, ఇంటింటికీ రూ.500 గ్యాస్ సిలిండర్ గ్యారంటీలను కొత్త ప్రభుత్వం అమల్లోకి తెచ్చామని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు, సమాన హక్కులు దక్కాలి. మహిళల అభ్యున్నతి లక్ష్యంగా రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల ద్వారా త్వరలోనే మరిన్ని వినూత్న కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. మహిళలకు అండగా ఉండేలా తమ ప్రభుత్వం మరిన్ని కొత్త పథకాలు అందుబాటులోకి తెస్తుందన్నారు.

మహిళా సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం తప్పకుండా దేశమందరి దృష్టిని ఆకర్షిస్తుందనే నమ్మకం ఉందని సీఎం అన్నారు.

## రేవంత్ రెడ్డి రేసు గుర్రం కాదు.. గుడ్డి గుర్రం



హైదరాబాద్, మార్చి 8: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మరోసారి విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి మూన్నెళ్ళ ముఖ్యమంత్రి అంటూ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి రేసు గుర్రం కాదని.. గుడ్డి గుర్రమని సెటైర్ విసిరారు. శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు జరుగుతున్న అన్యాయం, జీవో3ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్క్ వద్ద భారత్ జాగృతి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా ముగిసింది. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళల వాటా మహిళకు రావాలని.. గత ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు ఇచ్చిన మాట తప్పారన్నారు. ఒక అమ్మాయి చనిపోతే రాజకీయానికి వాడుకున్నారని మండిపడ్డారు. కోర్టు తీర్పు పేరు చెప్పి రేవంత్ రెడ్డి తప్పించుకున్నారన్నారు. జీవో 3 నిజమైతే 30వేల ఉద్యోగాల్లో ఎంత రిజర్వేషన్లు అమలు చేశారని ప్రశ్నించారు. నిరుద్యోగులు కన్ఫ్యూజ్‌లో ఉన్నారన్నారు. నిరుద్యోగులకు కాంగ్రెస ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చరిత్రలో మహిళలతో పెట్టుకున్న వారు ఎవరు బాగుపడరని.. తమ పోరాటం మహిళలకే కానీ పురుషులకు అన్యాయం చేయాలని కాదన్నారు. హారిజాంటల్ పద్దతిలో రిజర్వేషన్ పద్ధతి అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు.


ప్రభాత
సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194





ఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌పై బీజేపీ ఫోకస్ చేసిందా..? ఇటీవల బెంగాల్‌లో వరసగా ప్రధాని మోదీ పర్యటన.. ఆ తర్వాత కోల్ కతా హైకోర్టు మాజీ జడ్జీ అభిజిత్ గంగోపాధ్యాయ బీజేపీలో చేరిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలతో వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బెంగాల్‌లో సత్తా చాటాలని బీజేపీ వ్యూహాలు రచిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దానికి కొనసాగింపుగా మరో ఎత్తుగడ వేసింది బీజేపీ. ఓ ప్రముఖ క్రికెటర్‌ను బెంగాల్ లోక్ సభ బరిలో దింపనుందనే వార్తలు వస్తున్నాయి.
**ఎవరంటే..?** లోక్ సభ ఎన్నికల్లో క్రికెటర్ మహ్మద్ షమీని బరిలోకి దింపాలని బీజేపీ అనుకుంటోంది. ఇటీవల రగడ నెలకొన్న సందేశ్ ఖాలి పరిధిలో గల బరిషిత్ లోక్ సభ నియోజకవర్గం నుంచి బరిలో దింపుతామని లీకులు ఇస్తోంది. అక్కడ నుంచి తమ అభ్యర్థిని బరిలోకి దింపి గెలిపించుకుంటామని ధీమాతో ఉంది. బెంగాల్ గడ్డపై షమీ విజయంతో తమ ఖాతా తెరవాలని ఊబలాట పడుతోంది. బరిసిత్‌లో మైనార్టీల సంఖ్య ఎక్కువ అని, షమీ బరిలోకి దిగితే విజయం ఖాయం అని స్థానిక బీజేపీ నేతలు అభిప్రాయ పడుతున్నారు.
**మోదీతో సాన్నిహిత్యం..? :** ఇటీవల జరిగిన వరల్డ్ కప్‌లో షమీ ఇరగదీశాడు. బాల్‌తో అద్భుత ప్రదర్శన ఇచ్చాడు. ఫైనల్‌లో మ్యాచ్ ఓడిన తర్వాత.. డ్రెస్సింగ్ రూమ్ వద్దకు ప్రధాని మోదీ వచ్చారు. టీమిండియా సభ్యులను ఓదార్చారు. ఆ సమయంలో షమీని ప్రత్యేకంగా అభినందించారు. చాలా చక్కగా ఆడావని మరీ మరీ చెప్పారు. షమీని కౌగిలించుకున్నారు కూడా. ఆ తర్వాత మహ్మద్ షమీ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిశారు. దీంతో బీజేపీలో చేరడమో.. లేదంటే ప్రచారం చేస్తారని భావించారు. అనూహ్యంగా లోక్ సభ బరిలో నిలుపుతామని బీజేపీ పెద్దలు చెబుతున్నారు.
**బెంగాల్‌తో అనుబంధం :** మహ్మద్ షమీకి బెంగాల్‌తో అనుబంధం ఉంది. బెంగాల్ తరఫున రంజీ మ్యాచ్‌లు ఆడతారు. అలా అతడిని బెంగాల్ నుంచి పోటీ చేయించాలని బీజేపీ భావిస్తోంది.

షమీని లోక్ సభ నుంచి బరిలోకి దింపుతారనే ఊహాగానాలు నెలకొనగా.. షమీ స్వగ్రామం అమ్రోహాలో స్టేడియం నిర్మిస్తామని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదత్యనాథ్ ప్రకటన చేశారు. షమీకి ఇటీవల శస్త్ర చికిత్స జరిగిన సంగతి తెలిసిందే. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ఇంతలో లోక్ సభ బరిలో దింపుతామని బీజేపీ అంటోంది. దీనిపై షమీ స్పందించాల్సి ఉంది.

## వేయిస్తంభాల గుడి నిర్మాణానికి 72 ఏళ్లు పట్టింది: కిషన్‌రెడ్డి



హనుమకొండ: వేయిస్తంభాల గుడిని కట్టేందుకు 72 సంవత్సరాలు పట్టిందని కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆ ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో పునర్నిర్మించిన కల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. యాగశాలలో శాంతి హోమం చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మధ్యయుగంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేవాలయాలను ధ్వంసం చేశారన్నారు. తుగ్లక్ సైన్యం రామప్ప గుడి నుంచి వరంగల్ కోట వరకు అన్నింటినీ దెబ్బతీసిందని చెప్పారు. తాజాగా పునర్నిర్మాణం చేసిన వేయి స్తంభాల గుడి కల్యాణ మండపంలో 132 స్తంభాలు ఏర్పాటు చేసినట్లు కిషన్‌రెడ్డి వివరించారు. కాకతీయుల శిల్ప కళా వైభవం అద్భుతమని కొనియాడారు. ప్రాచీన కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిదన్నారు.

## తెలంగాణ భవన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

హైదరాబాద్, మార్చి 8: తెలంగాణ భవన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ కవిత, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ మహిళా కార్పోరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... తెలంగాణ ఆడ బిడ్డలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళ లేనిదే గమ్యం, గమనం లేదన్నారు. "మనకంటే ముందు తరంవారు మన అక్క, చెల్లెలు మన కోసం పోరాటం చేశారు" అని తెలిపారు. చాకలి ఐలమ్మ భూమి కోసం భుక్తి కోసం పోరాటం చేశారని... రాణి రుద్రమ పోరాటం మనకు స్ఫూర్తి అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళల అభ్యున్నతి కోసం పోరాటం కొనసాగించాలని కవిత వెల్లడించారు.



## భాగ్యనగర వాసులకు బిగ్ అలర్ట్.. రెండ్రోజులు నీళ్లు బంద్.. మీ ప్రాంతం ఉందా.. చెక్ చేసుకోండి




హైదరాబాద్: భాగ్యనగర వాసులకు హైదరాబాద్ తాగునీటి సరఫరా మండలి ఓ ప్రకటన జారీ చేసింది. మార్చి 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపేస్తున్నామని ఆ ప్రకటన సారాంశం. ఉస్మాన్‌సాగర్, హకీంపేట మధ్య జరుగుతున్న నీటి పైపుల మరమ్మతుల కారణంగా మార్చి 9న ఉదయం 6 గంటల నుంచి మార్చి 10 మధ్యాహ్నం 12 గంటల వరకు పలు ప్రాంతాలకు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోనుంది.
**ఎఫెక్ట్ అయ్యే ప్రాంతాలివే..** విజయనగర్ కాలనీ, హుమాయూన్ నగర్, కాకతీయ నగర్, సయ్యద్ నగర్, MES ప్రాంతాలు, బజార్ గార్డ్, AC గార్డ్స్, రెడ్ హిల్స్, ఇన్‌కమ్ టాక్స్ ఏరియా, సెక్రటేరియట్, CIB క్వార్టర్స్, ఇందిరా నగర్, BJR కాలనీ, అడ్వకేట్ కాలనీ, హిల్ కాలనీ, గోకుల్ నగర్, నాంపల్లి రైల్వే స్టేషన్, జంగం బస్తీ, అసెంబ్లీ, ఖైరతాబాద్, మల్లేపల్లి, లక్డీకాపూల్, సీతారాంబాగ్, గన్ ఫౌండ్రీ, చిరాగ్ అలీ లేన్, అబిడ్స్, న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్, LB స్టేడియం, BRK భవన్, బిర్లా మందిర్, హిందీ నగర్, ఘోడే కాబ్ర్ ప్రాంతం , దోమలగూడ, గాంధీ నగర్, ఎమ్మెల్యే కాలనీ, సయ్యద్ నగర్, తట్టిఖానా, NBT నగర్, నూర్ నగర్‌లు ప్రభావిత ప్రాంతాల లిస్టులో ఉన్నాయి. ఆయా ఏరియాల ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.

## ఎంజీఎంలో మంత్రి కొండా సురేఖ పర్యటన



వరంగల్, మార్చి 8: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మంత్రి కొండా సురేఖ శుక్రవారం పర్యటించారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఎంజీఎం ఆసుపత్రిలో నూతనంగా ఉద్యోగంలో చేరిన స్టాఫ్ నర్స్‌లకు మంత్రి టోపీలు ధరింపజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. నర్సింగ్ ఉద్యోగాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదల ఆసుపత్రికి వచ్చిన పేషంట్లకు అంకిత భావంతో సేవలు అందించాలని అన్నారు. కొంతమందికి వేతనాలు అందక ఇబ్బందులకు గురయ్యారని.. 10 సంవత్సరాల పాలనలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఉద్యోగులను కూడా పట్టించుకోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళిక లేకుండా వరంగల్ జైలును కూలగొట్టిందన్నారు. ఆస్పత్రి పేరుతో భవనాలు నిర్మించి.. ఎంజీఎంకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. అప్పు తెచ్చి డబ్బు వృథా చేశారని విమర్శించారు. ఎవరైన ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలు త్వరలోనే బయటకు తీస్తామన్నారు. ఎంజీఎం ఆసుపత్రి ని అన్ని రకాలుగా తీర్చిదిద్దుతామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

## నేను పార్టీ మారడం లేదు: మాజీ మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను మాజీ మంత్రి మల్లారెడ్డి కలిశారు. కుమారుడు భద్రారెడ్డితో పాటు ఆయన వెళ్లారు. లోక్‌సభ ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని కేటీఆర్‌కు భద్రారెడ్డి తెలిపారు. మరోవైపు గురువారం సీఎం రేవంత్ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలవడంపై మల్లారెడ్డి వివరణ ఇచ్చారు. తన అల్లుడు రాజశేఖర్‌రెడ్డికి చెందిన కళాశాల భవనాల కూల్చివేత అంశంపై కలిసినట్లు తెలిపారు.

తాను పార్టీ మారడం లేదని స్పష్టం చేశారు. గత నెలలో మల్లారెడ్డి మీడియాతో మాట్లాడుతూ మల్కాజిగిరి ఎంపీ స్థానానికి తన కుమారుడు భద్రారెడ్డి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అయితే భద్రారెడ్డి శుక్రవారం కేటీఆర్‌ను కలిసి పోటీ చేయడం లేదని తెలపడం ప్రాధాన్యం సంతరించుకుంది.



PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660